# 4

# దేవుని పక్షముగా

## (యోబు 32-37)

ఈ పాఠ్య భాగమందు, యోబు గ్రంథంపట్ల మన వైఖరి దాని ప్రధానాంశాలను చూడడం. ఆ గ్రంథము యొక్క ప్రధానమైన సందేశాన్ని పరిశీలించి చూచి ఆ సందేశాన్ని మన పరిస్థితికి వర్తింపజేయడం ముఖ్య ఉద్దేశమైయుంది. ఆ ఉద్దేశానికి అనుకూలంగా మనం కొన్ని భాగాలను గమనిద్దాం. 20, 22, 31 అధ్యాయాలను మనం దాటిపోతాం. వాటిలో యోబు సమస్యకు కారణం చర్చించబడింది (చర్చ కొనసాగింది). తాను పాపం చేసినట్టు యోబు స్నేహితులు అతనిని నిర్బంధించుతున్నారు. మొత్తము మీద, తొలి యిద్దరు స్నేహితుల్లో ఒక్కొక్కడు మూడేసిసార్లు మాట్లాడారు, మూడవవాడు రెండు సార్లు మాట్లాడాడు. కలతపరచబడిన మౌనానికి వారిలో ప్రతి ఒక్కడు చేరేవరకు యోబు ప్రతివానికి జవాబు యిస్తునే ఉన్నాడు. వారి అపనిందలు అతని వేదనలకు కష్టాన్ని చేర్చుతూనే ఉన్నాయి, యోబును కొట్టుతూనే ఉన్నాయి; అయినా అతడు తన నిర్దోషత్వాన్ని నిలుపుకొనడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఈ సందర్భంలో, నూతన వ్యక్తి, ఎలీహుకు రంగ ప్రవేశం జరిగింది. యోబుకును, అతని ముగ్గురు స్నేహితులకును జరిగిన వివాదమంతటిని ఎలీహు విన్నాడు. చివరిగా, అతడు మాట్లాడవలసి వచ్చింది.

### ఎలీహు ఎవడు?

ఎలీహు దేవుని వర్తమానికుడా? దేవుని వర్తమానంతో తాను పరలోకంనుండి దిగి వచ్చినట్టు ఎలీహు చెప్పుకొన్న కొన్ని సంగతులు కన్పించినా, 32వ అధ్యాయం ఆరంభ వచనాలలో అతని పితరులను గూర్చి చెప్పబడినందున, అతడు నరుడేయన్న సంగతి మనమెరుగుదుము. అతడు అబ్రాహామునకు సహోదరుడైన నాహోరు కుమారుడగు బూజు వంశస్థుడు (ఆది. 22:20, 21). యోబు యొక్క యితర స్నేహితులవలె ఎలీహు కొన్ని సత్యాలను పలికాడు. అతడు దైవ ప్రేరేపితుడు కాడు. కాని అతడు అంతర్ దృష్టి గలవాడు. అతడు గుర్తించదగిన గుణలక్షణములను కలవాడు.

*మొదట, ఎలీహు పెద్దరికాన్ని గౌరవించి, యిలా అన్నాడు,*

> నేను పిన్నవయస్సుగలవాడను మీరు బహు వృద్ధులు;
> ఆ హేతువుచేతను నేను భయపడి నా తాత్పర్యమును మీకు
> తెలుపుటకు నేను తెగింపలేదు.
> అధిక సంఖ్యగల యేండ్లు జ్ఞానము బోధింపదగునని నేననుకొంటిని
> (32:6బి-7).

యోబును, అతని ముగ్గురు స్నేహితులును ఎలీహుకంటె పెద్దవారైయుండిరి. అతడు త్వరపడి మాట్లాడకుండుటకు అది కారణము. వృద్ధాప్యమును, అనుభవమును జ్ఞానము బోధించునని అతడు తలంచాడు. కేవలం వయస్సు మాత్రమే ఒక వ్యక్తిని జ్ఞానవంతునిగా చేయదని అతడు నేర్చుకున్నాడు.

*రెండవది, అతడు దేవుని వాక్యాన్ని గౌరవించాడు.* "నరులలో ఆత్మ ఒకటి యున్నది సర్వశక్తుడగు దేవుని ఊపిరి వారికి వివేచన కలుగజేయును" అని అతడన్నాడు (32:8). దేవుని వాక్యాన్ని ఆలకించే యువకునికి కూడ జ్ఞానమును, వివేచనయు ఉండునని అతని భావన. దేవుడు జనుల చెవులను తెరచి వారికి ఉపదేశమునిచ్చును, వారి హృదయాలను మార్చును, వారి గర్వమును తొలిగించును (33:16-18), అది వారి రక్షణగా పరిణమించును.

*మూడవది, అతడు ధైర్యమును, స్థిర బుద్ధియు గలవాడైయున్నాడు.* మనుష్యులను మెప్పించే దానికంటెను అతడు దేవుని పక్షమున మాట్లాడుటకు శ్రద్ధగలవాడై (అక్కర గలవాడై) యున్నాడు. అతని వద్ద వర్తమానం ఉంది. దాన్ని పంచుకొనడానికి అతడు బాధపడుతున్నాడు:

> నా మనస్సునిండ మాటలున్నవి,
> నా అంతరంగముననున్న ఆత్మ నన్ను బలవంతము చేయుచున్నది.
> నా మనస్సు తెరవబడని ద్రాక్షారసపు తిత్తివలెనున్నది,
> క్రొత్త తిత్తులవలె అది పగిలిపోవుటకు సిద్ధముగానున్నది.
> నేను మాటలాడి ఆయాసము తీర్చుకొనెదను.
> నా పెదవులు తెరచి నేను ప్రత్యుత్తరమిచ్చెదను;
> మీరు దయచేసి వినుడి నేను ఎవరియెడలను పక్షపాతినైయుండను.
> నేను ఎవరికిని ముఖస్తుతికై బిరుదులు పెట్టను (32:18-21).

అతడు కించపడిన భావాలను తెలివినుపయోగించి సర్దుకోలేదు. యథార్థంగాను, తేటగాను మాట్లాడ అతడు అనుమతిని కోరాడు. అతడు యోబుతో యిలా అన్నాడు: "నా మాటలు నా హృదయ యథార్థతను తెలుపుచున్నవి. నా పెదవులు జ్ఞానమును యథార్థముగా పలుకును" (33:3).

ఎలీహుకున్న అహంకారమే అతనిలోని ఆటంకపూరితమైన గుణం. అతడున్న పరిస్థితిని గురించి అతనికి బాగా తెలుసు. "నీవు నా మాట ఆలకింపుము మౌనముగా నుండుము, నేను నీకు జ్ఞానము బోధించెదను" అని అతడు యోబుతో అన్నాడు (33:33).

## ఎలీహు యొక్క సందేశమేమి?

చెప్పినదంతా విన్న తరువాత, ఎలీహు భావోద్రేకంతో నిండిపోయాడు. చిన్న సందు కూడ లేని ద్రాక్షా తిత్తిలా ఊరి అతడిక నేమాత్రము ఆగలేని స్థితిలో నిలిచాడు.

యోబు ముగ్గురు స్నేహితులు పలికిన ప్రతిపాదనల విషయంలో ఎలీహు కోపగించుకున్నాడు (32:3). వారి వాదనలు ఒప్పింపలేనివిగా ఉన్నాయి. అయినప్పటికి వారు యోబుపై నేరం మోపారు. వారికంటె యోబు శ్రేష్ఠమైన వ్యాజ్యం పెట్టాడు గనుక

వారు యోబుకు ఉత్తమముగా జవాబు యిచ్చి ఉండవలసి ఉంది. తాము జ్ఞానులమని చెప్పుకున్నందుకు అతడు వారిని మందలించాడు: నోటికి రుచి తెలిసినట్టు చెవికి మాటల ఇంపు తెలుస్తుందని అతడన్నాడు. వారి మాటలను అతడు చవిచూచాడు. ఏది ఉత్తమమైనదో అది యింకా వారు తేల్చుకోలేని స్థితిలో ఉన్నట్టు అతడు వారిని పసికట్టాడు (34:1-4).

పైగా, ఎలీహు యోబును తొందరపెట్టాడు (32:2). దేవుని సమర్థించడానికి బదులు, యోబు తన్ను నీతిమంతునిగా కనుపరచుకొన జూచినందుకు అతడు యోబుపై కోపగించుకున్నాడు. ఎవరు ఎవరి యెదుట పరీక్షింపబడుతున్నారు అనే విషయంపై అతడు యోబును దిద్ద ప్రయత్నించాడు. దేవుడును ఆయన తీర్పులును నరులయెదుట పరీక్షింపబడవు. నరుడు వాని మార్గములు దేవుని యెదుట పరీక్షింపబడతాయి (33:12-14). జ్ఞానంలేకుండ యోబు మాట్లాడినట్టు ఎలీహు భావించాడు (34:35; 35:16). దేవుని న్యాయాన్ని యోబు ప్రశ్నించడం అతనికి యిష్టం లేకుండాపోయింది. అతడు యోబు మాటలను రివ్యూ చేసి, దేవుని నిందించడం యోబుది తప్పని అతడు యోబుకు వినిపించాడు:

> నిశ్చయముగా నీ పలుకులు నా చెవినిబడెను నీ మాటల ధ్వని నాకు వినబడెను,
> ఏమనగా - నేను నేరములేని పవిత్రుడను;
> మాలిన్యములేని పాపరహితుడను;
> ఆయన నామీద తప్పులు పట్టించుటకు సమయము వెదకుచున్నాడు,
> నన్ను తనకు పగవానిగా భావించుచున్నాడు.
> ఆయన నా కాళ్లను బొండలో బిగించుచున్నాడు.
> నా త్రోవలన్నిటిని కనిపెట్టుచున్నాడని నీవనుచున్నావు,
> ఈ విషయములో నీవు న్యాయము కనిపెట్టలేదు
> నేను నీకు ప్రత్యుత్తరము చెప్పెదను (33:8-12).

దేవుని పక్షమున వాదించడానికి ఎలీహు పూనుకున్నాడు. *తొలిగా, అతడు దేవుని తీర్పులు న్యాయమైనవని చెప్పసాగాడు:* "దేవుడు ఏ మాత్రమును దుష్కార్యము చేయడు సర్వశక్తుడు న్యాయము తప్పడు" (34:12). తరువాత అతడిలా అన్నాడు,

> కొంతసేపు నన్ను ఓర్చుకొనుము ఈ సంగతి నీకు తెలియజేసెదను
> ఏలయనగా దేవుని పక్షముగా నేనింకను మాటలాడవలసియున్నది. దూరమునుండి నేను
> జ్ఞానము తెచ్చుకొందును నన్ను సృజించినవానికి నీతిని ఆరోపించెదను (36:2, 3).

తాను యథార్థవర్తనుడని, తనకు కలుగుచున్న బాధలు అన్యాయపు శిక్షగా ఉన్నవని యోబు ప్రకటించాడు. దేవుడు తన్ను శత్రువుగా భావిస్తున్నట్టు అతడు ఆరోపించాడు. అందుకు ఎలీహు యిలా అన్నాడు: "ఈ విషయములో నీవు (యోబు) న్యాయము కనిపెట్టలేదు ... దేవుడు నరుల శక్తిని మించినవాడు, నీవేల ఆయనతో పోరాడుదువు?" అని అతడు యోబును అరికట్టజూచాడు (33:12, 13). మానవాళి అంతటికంటె ఎంతో ఉన్నతమైనవాడు గనుక తన నీతి దేవుని నీతికంటె అధికమైనదని నరుడు ఎన్నడూ

తలంచకూడదు (35:2). యోబు ఎదుర్కొంటున్న సమస్యలకు యోబే తప్ప దేవుడు నిందింపబడకూడదని ఎలీహు భావనయై ఉంది. నీతిని, జ్ఞానాన్ని అతడు దేవునికే ఆరోపిస్తున్నాడు (36:2, 3).

దేవునికి మించిన న్యాయవంతులెవరును ఉండరు (34:17). న్యాయమును, నీతి తీర్పులును దేవుని చేతిలో ఉండగా, నరుడు దేవునియందు నమ్మిక ఉంచవలసిందే తప్ప ఆయన మీద నేరం మోప వీలుపడదని అతని తలంపు (35:14). మనుష్యులు సాధారణంగా యిక్కడ అపార్థం చేసికొంటారు. ఏదో ఒకటి దేవుడు ఎందుకు చేశాడో, చెప్పాడో గ్రహించినప్పుడు, తనకు అర్థం కాలేదని అంగీకరించడం ధర్మమైయుంటుంది. దేవుని చిత్తముతో తమ జీవితాలు పొసగనివారు నేటి ప్రజల అవసరతలకు అది సరిపోదని తరచుగా తలంచుతారు. ఇంతకు సత్యమేమంటే, ఏది అతి శ్రేష్ఠమైనదో నిర్ణయించే స్థితిలో నరుడు లేడు. మానవాళికి ఏది అత్యుత్తమమైనదో అన్నివేళల అది అలా వారికి కన్పించదు. తప్పు, ఒప్పుల వలలో చిక్కుకున్న తరువాత అత్యుత్తమమైనదాన్ని అనుభవ పూర్వకంగా వారు కనుగొనే అవకాశముంటుంది. దేవునికి అంతకుముందే అది తెలుసు. తప్పు ఒప్పుల పద్ధతుల్లో ఆయన పరిశోధన చేయనవసరం లేదు.

దేవుడు మనలను, మనం నివసించే ఈ లోకాన్ని చేశాడు. మనకు అతి శ్రేష్ఠమైనదేదో అది ఆయనకు తెలుసు. మనం ఆయన జ్ఞానమందు విశ్వాసముంచి, ఆయన తీర్పులను గౌరవించాలి. సహజంగానే, దేవుని కార్యములన్నిటిని మనం గ్రహించలేం. ఆయన ఏమి ఎరుగునో అది మనకు తెలియదు. గనుక, తప్పు చేసినట్టు దేవునిపై నేరం మోపగల వాడెవడు? (36:23).

*రెండవది, ప్రశ్నించినప్పుడు మౌనంగా ఉండడం దేవుని హక్కు* అని ఎలీహు ఆయన పక్షంగా వాదిస్తున్నాడు. నరులకంటె దేవుడు ఎంతో ఉన్నతమైనవాడు, గనుక తాను జరిగించేవాటన్నిటికి హేతువులనివ్వడానికి ఆయన నరునికి పూటపడియుండలేదు (33:12-14). మన జీవితాలలోను, ప్రకృతిలోను అలా జరిగేవి ఎందుకు జరుగుతున్నాయని కుతూహలంగల జనులు శతాబ్దాల తరబడి అడుగుతునే ఉన్నారు. మన విశ్వాన్ని గూర్చి మనం ఎంత ఎక్కువగా నేర్చుకుంటామో, అంతగా యిది "ఎందుకు" అని అనుకుంటామే గాని, సృష్టికర్తయైన దేవునికి తెలిసినంతగా మనం ఎప్పటికిని తెలిసికోలేం. దేవునికి తెలిసినదంతా మనకు తెలిస్తే, ఆయన దేవుడై ఉండడు! ఆయనకు తెలిసినంత తమకు తెలియుననుకొనేవారికి ఆయన దేవుడై ఉండడు. వారు భయముతోకూడిన ఆశ్చర్యంతోను, భక్తి మర్యాదలతోను ఆయనను సమీపించరు. అహము యొక్క ప్రాముఖ్యతచేత భ్రమలో చిక్కుకున్నవారు దేవునిపై ఆధారపడవలెనన్న సంగతియే మరచిపోతారు.

*మూడవది, మన విధేయతకొరకు ఎదురు చూడడానికి గల దేవుని హక్కును* ఎలీహు సమర్థిస్తున్నాడు. "దేవునికి లోబడడం దేనికి? అందులో ఏమి ప్రయోజనముంది?" అని యోబు అడిగినట్టు ఎలీహు నమ్ముతున్నాడు (35:2, 3). దేవుని సేవించడంవలన ప్రయోజనం లేదని కొన్నిసార్లు జనులు యోచిస్తారు. తాను నిర్దోషిగా ఉండినా, తాను పాపం చేసియుండినా వ్యత్యాసం లేకుండేదే అన్నట్టు యోబు తలంచుతున్నాడు. ఆయనకు లోబడడంవలన మనం దేవునికి చేయగల ప్రత్యేక ఉపకారం ఏమీలేదని యోబు

గ్రహించేలా ఎలీహు ప్రయాసపడుతున్నాడు. తన ప్రజలు నీతి న్యాయములననుసరించి నడిస్తే దేవుడు ఆనందించేది వాస్తవమే గాని, నీతిని బట్టి దేవునికి మేలు కలుగదు సరిగదా, పాపంవలన ఆయనకు వాటిల్లే నష్టమేమీ లేదు (35:6-8). మేలులు పొందగోరియే క్రైస్తవులు దేవుని సేవించరాదు. విధేయత దీవెనలు పొందు మాట వాస్తవమే అయినా ఆయనను సేవించేది కేవలం అందుకే అయుండకూడదు.

నాల్గవది, దేవుని ఘనతను ఎలీహు కొనియాడాడు. నరులు ఆయనను సంపూర్ణంగా అర్థం చేసికోలేనంత ఘనుడు (36:26). ఆయన ఘనత సృష్టియందు ప్రదర్శించబడింది. భూమిమీద సమృద్ధిగా వర్షం కురిపించునట్లు ఆయన మేఘాలను రూపించుతాడు. అవే మేఘాలచే ఆయన సూర్యుని మాటుగా చేస్తాడు (36:27-32). దేవుని మహా ఘనత ఆయన సన్నిధిని వణకునట్లు ఎలీహును చేసింది (37:1నుండి). దేవుని స్వరమునకు అతడు ఉరుములను మెరుపులను పోల్చాడు.

సృష్టిలోని దేవుని కార్యములు మనం గ్రహింపజాలనంతటివి. ఆయన మంచును కురిపిస్తాడు. శీతాకాలంలో అడవి మృగాలను గుహలలోనికి పంపుతుంది. తరువాత ఆయన దక్షిణపు గాలి విసరజేసి వేసవికాలాన్ని పుట్టిస్తాడు. తన ఊపిరిచేత ఆయన మంచు పుట్టించును. తుఫానును పుట్టించును, మేఘములు ఆయన కోరిన చోటికి నడిపించబడతాయి. దేవుడు ఆ పటాన్ని అంతటిని చూస్తాడు. ప్రతిదానికి ఆయనకు ఒక ఉద్దేశముంటుంది. కొన్నిసార్లు తుఫానులు భూమి క్షేమంకొరకు వస్తాయి. పాములు, దోమలు లేక కందిరీగలవలన ప్రయోజనమేమిటో ఒక సగటు నరునికి తెలియకపోవచ్చు; అయితే దేవుని సంపూర్ణమైన పటంలో వాటికి భాగముంది. మనము మన చిన్న జీవిత పరిధిని గూర్చి ఆలోచిస్తుంటాము. కేవలం మనకొరకే దేవుని ప్రకృతి సూత్రాలను సహా మార్చబడితే బాగుండునని తలంచుతుంటాం. మనం కావాలని కోరుకునేది మన స్నేహితులో లేక మన పొరుగువారో కోరుకునేదానికి భిన్నంగా కూడ ఉండవచ్చు. పిక్‌నిక్‌ను పాడుచేసే వర్షము ఆ ప్రాంతంలోని పంటలను రక్షించడానికి అవసరమై యుండవచ్చు.

వాతావరణాన్ని దేవుడెలా నియమిస్తాడో మనకు తెలీదు. ఎలీహు ఈ సందర్భంగా చిన్న వర్ణన నిచ్చాడు:

> దేవుడు ఆశ్చర్యముగా ఉరుము ధ్వని చేయును మనము గ్రహింపలేని గొప్ప కార్యములను ఆయన చేయును-నీవు భూమిమీద పడుమని హిమముతోను వర్షముతోను మహావర్షముతోను ఆయన ఆజ్ఞ ఇచ్చుచున్నాడు. మనుష్యులందరు ఆయన సృష్టికార్యమును తెలిసికొనునట్లు ప్రతి మనుష్యుని చేతిని బిగించి ఆయన ముద్రవేసి యున్నాడు. ... శిక్షకొరకే గాని తన భూలోకము కొరకే గాని కృపచేయుటకే గాని ఆయన ఆజ్ఞాపించినదానిని అవి నెరవేర్చును (37:5-13).

సృష్టియొక్క క్రమమైన తీరును చూచి, పోతపోసిన అద్దమంత దట్టమైనదగు ఆకాశమును ఆయన వ్యాపింపజేసినందుకు ఎలీహు ఆశ్చర్యపోయాడు (37:15-18).

మానవ కన్ను నేరుగా సూర్యునిలోనికి ఎలా చూడలేదో అలాగే నరమాత్రులు దేవుని సంపూర్ణతను వీక్షించలేరు. ఆయన "భీకరమైన మహిమను ధరించుకొని" వచ్చును (37:22). ఎలీహు ఇలా అంటున్నాడు, "సర్వశక్తుడగు దేవుడు మహాత్మ్యముగలవాడు,

ఆయన మనకు అగోచరుడు. న్యాయమును నీతిని ఆయన ఏ మాత్రమును చెరుపడు” (37:23).

## ముగింపు

సమస్తమును దేవుని వశములో ఉన్నది. అలాటప్పుడు, ఆయన ఈ జీవితపు శోధనలను ఎందుకు ఆపడు? నాశనమును, బాధను ఎందుకు అనుమతిస్తాడు? ప్రేమగల తండ్రియొక్క స్వభావంతో భయంకరమైన పరిస్థితులు పొందిక కలిగి ఉన్నాయా? జీవితంలోని ఈ కష్టాలు ఎందునిమిత్తం వస్తాయి.

కొన్నిసార్లు శ్రమలు లేక శోధనలు దిద్దుబాటుకొరకు రావచ్చు. దేవునివలె ఎవరును ఉపదేశింపలేరు (36:22). బాధలో నేర్చుకున్న పాఠాలు దీర్ఘకాలం జ్ఞాపకం ఉంటాయి. కష్టాలు మనస్సును ముఖ్యమైన వాటివైపు మల్చుతాయి. బాధ, కష్టమనేది మనిషిలోనుండి శ్రేష్ఠమైనదాన్ని వెలుపలికి తేవచ్చు; సుఖము, ఐశ్వర్యము అనర్థకం తేవచ్చు. దుఃఖము, బాధ అనుభవించేలా దేవుడు అనుమతి యివ్వవచ్చు, కాని ఆయన శ్రమలోనుండి కడకు మనలను విడిపిస్తాడు. ఆయన పునరుద్ధరించి విశ్రమింపజేస్తాడు (33:23–26). మనం శిక్షింపబడినప్పుడు, “–నేను శిక్షనొందితిని నేను ఇకను పాపము చేయను, నాకు తెలియని దానిని నాకు నేర్పుము నేను దుష్కార్యము చేసియున్నయెడల ఇకను చేయనని” దేవునితో చెప్పడం యుక్తమైయుంటుంది (34:31, 32; NIV).

కష్టాలు దేవుని కనికరమునకు ప్రదర్శనలు కూడ అయ్యుండవచ్చు. దేవుని కృప, కనికరం అనేవి చాలా వివరించలేని అంశాలు. నరుల పట్ల తన కనికరాన్ని ప్రదర్శించ డానికి దేవుడు ఏమి చేశాడో ఆ సమయంలో అది వారికి కనికరముగా కన్పించకపోవచ్చు. వినాశపూరితమైన లోకానికి క్రీస్తు సిలువ మరణం కృపా కార్యమైయుంది. కాని దాన్ని భరించడానికి క్రీస్తు ప్రభువునకు అప్పటిలో అది బహు కష్టమైనదైయుంది. నీనెవెలోని దుష్టులైన జనుల మధ్యకు దేవుడు తనను పంపడం యోనాకు బహు కష్టమైన పనిగా అతడు తలంచియుండవచ్చు. అయితే అతని పని ఆ దేశమునకే దేవుని కృపా కార్యమైయుంది.

ఏ ఒక్క కష్టము జీవితపు కడపటి గాథను తెలపదు. ఏ ఒక్క సంఘటనయు మనలను ఓడించకూడదు. జీవితపు పరిస్థితులయొక్క సారాంశము దాని ఫలితాన్ని తీర్మానిస్తుంది. సంఘటన ఏదైనప్పటికిని, దాని ప్రయోజనము కొరకు కష్టాన్ని దాటి మనం చూడవలసి యుంటుంది. అందులో ఏ మంచిగాని లేక ఏ హేతువుగాని మనం చూడలేక పోయినట్టయితే, అది మనం పరిమితులం గనుకను, పరిస్థితిని భూసంబంధమైన దృష్టినుండి చూచినందునను అలా గోచరించి యుండవచ్చు. కడపటి ఫలితము ఒక అనుభవం యొక్క విలువను తీర్మానిస్తుంది.

జ్ఞానం లేకుండ మాట్లాడినందుకు ఎలీహు యోబుపై నేరం మోపాడంటే, రైటే చేశాడు. తాను ఏమి మాట్లాడుతున్నది యోబుకు తెలియలేదు. సర్వశక్తుడగు దేవుని పనులను గ్రహించడానికి అతడు ప్రయత్నించాడు. మనం కూడ ఓరిమిగలవారమై, దేవునిపై తీర్పు తీర్చడానికి పూనుకోకుండ, చివరి ఫలితం కొరకు వేచియుందాం.